

పల్లెల్లో పడకేసిన 'ప్రత్యేక' పాలన 8లో..
ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రజలు గుర్తించారు 8లో..


ఎవరి లెక్కలు వారివే..

- బూత్‌ల వారీగా పోలింగ్‌పై అంచనాలు
- అంకెలతో రాజకీయ నేతల కుస్తీ
- ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం భద్రం
- పార్లమెంట్ ఎన్నికల్లో స్వల్పంగా పెరిగిన పోలింగ్

జగిత్యాల, మే 14 (ఆంధ్రజ్యోతి): లోక్ సభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో జిల్లాలో జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల సెగ్మెంట్‌లో ప్రధాన పార్టీలు, అభ్యర్థులు అంకెలతో కుస్తీ పడుతున్నారు. అభ్యర్థులు, కార్యకర్తలు విజయా లకు సంబంధించిన ఓట్ల లెక్కలు వేసుకుంటూ... ఎవరికి వారు తామే గె లుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. పార్టీల బలాలు, అభ్యర్థులపై ఉన్న వ్యక్తిగత వ్యతిరేకతలు తమకు అనుకూలమైన అంశాలను కులాల వారి గా, వర్గాల వారిగా, ప్రాంతాల వారిగా ప్రధాన పార్టీలు లెక్కలు కట్టుకుంటున్నాయి. లోక్ సభ ఎన్నికలు ముగిసి ఈవీఎంలలో పోలైన ఓట్లలో అభ్యర్థుల భవితవ్యం భద్రపరచబడింది. ఎన్నికల్లో జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గంలో ఏ పార్టీకి చెందిన అభ్యర్థులకు విజయావకాశాలు ఎలా ఉంటాయన్న విషయాలపై గ్రామాల్లో చర్చలు జోరుగా సాగుతున్నాయి. నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పోటీ చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పోటీ చేశారు. పలు ఇతర పార్టీల అభ్యర్థులు, పలువురు స్వతంత్రంగా బరిలోకి దిగిన అభ్యర్థులు భవితవ్యం ఎలా ఉంటుందోనని పలువురు చర్చింకుంటున్నారు.

● ఓటరు తీర్పు కోసం ఎదురుచూపులు...

పార్లమెంట్ ఎన్నికల ఫలితాల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికలను ఏడు విడతలుగా నిర్వహిస్తుం డగా, మూడో విడతలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు జరిగాయి. ఏడు విడత ల ఎన్నికలు వివిధ ప్రాంతాల్లో పూర్తయిన తదుపరి ఫలితాలు వెల్లడించ నున్నారు. దీంతో రాజకీయ పక్షాలు, అభ్యర్థులతో పాటు ఓటర్లు సైతం ఫలితాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి తయారైంది. దాదాపు పక్షం రో జుల పాటు ప్రచారం హోరెత్తించి ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నా నా జిమ్మిక్కులు ప్రదర్శించిన నేతలు ఓటరయ్య ఏ తీర్పు ఇస్తాడోనని ఉ త్కంఠగా ఎదురుచూస్తున్నారు. కట్టుదిట్టమైన ఎన్నికల నియమావళి కారణంగా నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో రోడ్‌షోలు, గ్రామాల్లో పాదయాత్రలు, ఇంటింటి ప్రచారం, మోటారు సైకిళ్ల ర్యాలీల ద్వారా ప్రచారాన్ని హోరెత్తించి చివరి రెండు రోజులు మాత్రం సర్వశక్తులూ కూడగట్టుకొని దాదాపుగా అన్ని పార్టీల అభ్యర్థులు ప్రలోభాలకు ప్రయత్నించి ఓటర్ల దృష్టిని తమవైపు మరల్చుకునేందుకు ప్రయత్నించాయి.



● స్వల్పంగా పెరిగిన పోలింగ్...

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో 2019లో జరిగిన ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం స్వల్పంగా పోలింగ్ పెరిగింది. గత ఎన్నికల్లో 68.37 శాతం పోలింగ్ జరగగా, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో 71.92 శాతం పోలింగ్ నమోదైంది. గతంతో పోలిస్తే 3.55 శాతం పోలింగ్ పెరిగింది. 2019 ఎన్నిక ల్లో 15,52,838 మంది ఓటర్లుండగా 10,61,622 మంది ఓటు హక్కును వి నియోగించుకున్నారు. ఇందులో జగిత్యాల అసెంబ్లీ సెగ్మెంట్‌లో 70.24 శా తం, కోరుట్లలో 69.09 శాతం, బాల్కొండలో 72.01శాతం, నిజామాబాద్ రూరల్‌లో 71.71 శాతం, నిజామాబాద్ అర్బన్‌లో 56.25 శాతం, బోధన్‌లో 71.94 శాతం, ఆర్మూర్‌లో 70.47 శాతం పోలింగ్ నమోదైంది.

● అంకెలతో నేతల కుస్తీ..

జిల్లాలో ప్రధాన రాజకీయ పక్షాలకు చెందిన పలువురు బడా నేతలు సైతం సెగ్మెంట్‌లో ప్రచారం చేశారు. బీజేపీ తరపున ప్రధాన మంత్రి నరేం ద్ర మోదీ, కాంగ్రెస్ తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి మాజీ సీఎం కేసీఆర్ తదితర హేమా హేమీలు జిల్లాలో పర్యటించి ప్రచా రం నిర్వహించారు. పార్టీల విస్తృత ప్రచారానికి ఓటర్ల స్పందన ఎలా ఉం ది, ఓటర్లను ఆకర్షించేందుకు ఏయే పద్ధతుల ద్వారా ప్రచారం సాగింది, దానికి ఓటర్ల స్పందన ఎలా ఉందనే అంశాలపై రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, కార్యకర్తలు మునిగితేలుతున్నారు. అంకెలతో కుస్తీలు పడుతూ జయాపజయాలను అంచనావేస్తున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నుంచి 29 మంది బరిలో ఉన్నప్పటికీ ప్రధాన పోటీ ముగ్గురి మధ్యనే నెలకొంది. ఈ ఎన్నికల్లో పోటాపోటీగా ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రచారం ఉండడం తో ఫలితాలపై ఓటరు నాడి చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఓటర్ల మనోగ తం ఏ మాత్రం అర్థం చేసుకోలేకపోతున్నామని పలువురు రాజకీయ నా యకులు పేర్కొంటున్నారు. గతంలో కంటే ఓటర్లలో రాజకీయ చైతన్యం కూడా పెరుగుతుండడంతో ఓటర్లు ఏ నిర్ణయం తీసుకుంటారో వారి సన్నిహితులకు కూడా అర్థం కావడం లేదు. వచ్చే నెల 4వ తేదిన జరగనున్న ఓట్ల లెక్కింపు పూర్తయితే గానీ అంచనాలకు సరైన సమాధానం దొరికే పరిస్థితి కానరావడం లేదు.



● ఓట్లపై ఎవరి ఆశలు వారివే...

బీఆర్‌ఎస్‌పై వ్యతిరేకత వల్ల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ లోక్‌సభ ఎన్నికల్లో మైనారిటీ ఓటర్లపై ఆశలు పెట్టుకుంది. మైనారిటీ ఓట్లు తమకే పడుతాయని కాంగ్రెస్ ధీమాతో ఉంది. మరోవైపు అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దవుతాయని, ఆ పార్టీ రాజ్యాంగాన్ని సమూలంగా మార్చివేస్తుందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ఎన్నికల ప్రచారం కూడా తమకు బాగా కలిసి వచ్చే అంశమని కాంగ్రెస్ భావిస్తోంది. ఎస్సీ, ఎస్టీ తదితర వర్గాల ఓట్లు గంపగుత్తగా తమ ఖాతాలోనే వచ్చి పడుతాయని అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా యువత, హిందుత్వ భావం తమకు బలమైన ఓటు బ్యాంక్ అని బీజేపీ అంచనాలు వేస్తోంది. దేశ అంతర్గత భద్రతపైన మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, అర్టికల్ 370 రద్దు వంటి అంశాలు యువతను విశేషంగా ఆకట్టుకుంటున్నాయంటున్నారు. అదే సమయంలో మోదీ హయాంలోనే ప్రపంచ వ్యాప్తంగా భారత్ ప్రతిష్ఠ పెరిగిందన్న భావన కూడా యువతలో బలంగా ఉందని బీజేపీ అంచనా వేస్తోంది. ఈ రెండు అంశాలతో పాటు అయోధ్యలో రామాలయ నిర్మాణం వల్ల హిందువుల ఓట్లు తమకే పడుతాయని బీజేపీ శ్రేణులు ధీమాగా ఉన్నాయి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం జరిగిందని ప్రస్తుతం ప్రజలు నమ్ముతున్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటర్లు జై కొడుతారని ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

● 2024 ఎన్నికల్లో ఇలా..

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం ఓటర్లు 17,04,867 మంది ఉండగా, 12,26,133 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పా ర్లమెంట్ పరిదిలో 71.92 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో జిల్లాలోని జగిత్యాలలో 73.87 శాతం, కోరుట్లలో 73.75 శాతం, నిజామాబాద్ జిల్లా బాల్కొండలో 74.75 శాతం, నిజామాబాద్ రూరల్‌లో 74.54 శాతం, నిజా మాబాద్ అర్బన్‌లో 61.83 శాతం, బోదన్‌లో 74.56 శాతం, ఆర్మూర్‌లో 73.14 శాతం పోలింగ్ నమోదైంది.

లాఠీచార్జి ఘటనపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల, మే 14 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో సజావుగా పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు తమకు నిబంధనల ప్రకారం రావాల్సిన 5 రోజుల భత్యం ఇవ్వాలని డిమాండ్ చేసిన ఉపాధ్యాయులపై లాఠీచార్జీ చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పీఆర్‌టీయూ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్ నాథ్ రెడ్డి, ఆనంద్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు సరైన రెమ్యూనరేషన్ ఇవ్వకుండా పోలీసులతో లాఠీచార్జీ చేయడం బాధాకరమన్నారు. సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్య మహిళ శిబిరంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

కొడిమ్యాల, మే 14 : ఆరోగ్య మహిళ శిబిరంపై వైద్య అధికారులు, సిబ్బంది అవగాహన కలిపించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ఓపీ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వస్తున్న మహిళ వివరాలను తెలుసుకున్నారు. ఈ పరిశీలనలో వైద్యాధికారి, పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, హెచ్‌వీలు వెంకటనర్సమ్మ, అలివేలు, ఏఎన్‌ఎంలు, ఎల్.టీ శ్రీనివాస్ ఉన్నారు.

కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల టౌన్, మే 14 : ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి జైపాల్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు స్త్రీ సంబంధిత వైద్య సేవలపై అవగాహన కల్పించారు. ఈ క్యాక్రమంలో వైద్యురాలు చైతన్య రాణి ఉన్నారు.

మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ

ధర్మపురి, మే 14: ధర్మపురి మండలంలో పలువురు వేర్వేరు కారణాలతో మృతి చెందగా ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. ధర్మపురి పట్టణానికి చెందిన రిటైర్డ్ ట్రాన్స్‌కో ఏడీఈ ఇందారపు సాంబయ్య, ఎస్సీ కాలనీకి చెంది బొల్లారపు లక్ష్మి మృతి చెందగా కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. మండలంలోని దొంతాపూర్ గ్రామానికి చెందిన కర్నె రమేష్ ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు రూ 10,000 ఆర్థికసాయం అందించారు. అలాగే దొంతాపూర్, జైనా గ్రామాల్లో పలు కుటుంబాలను పరామర్శించారు. కుటుంబ సభ్యులను అన్ని విధాల ఆదుకుంటామని ఆయన తెలిపారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జక్కు రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, ఆశెట్టి శ్రీవాస్, బొల్లారపు పోచయ్య పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని మోత్కురావుపేట గ్రామానికి చెందిన భూమల్ల గణేష్ దుబాయ్‌లోని అలెన్ ఏరియాలో ప్రమాదవశాత్తు మ్యాన్ హోల్‌లో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం అతని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. పార్థివ దేహాన్ని త్వరగా తీసుకువచ్చేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి, వారి కుటుంబసభ్యులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఓటింగ్‌లో సగానికి లోపే పరిమితమైన థర్డ్ జెండర్

జగిత్యాల, మే 14 (ఆంధ్రజ్యోతి): లోక్ సభ ఎన్నికల పోలింగ్‌లో ఓటర్ల పోటు ఎత్తినప్పటికీ థర్డ్ జెండర్‌లు ఓటింగ్ సగానికి లోపే పరిమితమైంది. నిజామాబాద్ పార్లమెంట్ పరిదిలోని ఏడు సెగ్మెంట్‌లలో జరిగిన పోలింగ్‌లో థర్డ్‌జెండర్‌లు యాభై శాతానికి మించి ఓటు వేయకపోవడం చర్చనీయాంశమైంది. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 మంది థర్డ్ జెండర్ ఓటర్లుండగా, జగిత్యాలలో 24 మంది, కోరుట్లలో నలుగురు, బాల్కొండలో 3 మంది, నిజామాబాద్ రూరల్‌లో 6 మంది, నిజామాబాద్ అర్బన్‌లో 41 మంది, బోధన్‌లో 5 మంది, ఆర్మూర్‌లో 7 మంది థర్డ్ జెండర్‌లున్నారు. కాగా ఈనెల 13వ తేదిన జరిగిన ఎన్నికల్లో థర్డ్ జెండర్ ఓటర్లు 39 మంది ఓటును వినియోగించుకున్నారు. ఇందులో జగిత్యాల నియోజకవర్గంలో 13 మంది, కోరుట్ల నియోజకవర్గంలో ఒక్కరు, నిజామాబాద్ రూరల్ 3 మంది, నిజామాబాద్ అర్బన్‌లో 18 మంది, ఆర్మూర్‌లో 4 మంది థర్డ్ జెండర్లు పోలింగ్‌లో భాగస్వామ్యం అయ్యారు. సగానికి లోపే థర్డ్ జెండర్ ఓటర్లు పోలింగ్‌లో భాగస్వామ్యం కాకపోవడం చర్చనీయాంశమైంది.

బాధితుడికి ఎంపీ బండి సంజయ్‌కుమార్ పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న ఎంపీ

కథలాపూర్, మే 14 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని చింత కుంటలో చోటు చేసుకున్న ఘర్షణలో గాయపడ్డ నేతుల మల్లేశ్‌ను మంగళవారం ఎంపీ బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. బీఆర్‌ఎస్ నాయకులు టాటా ఏస్ వాహనాన్ని ఎక్కించి గాయపరచగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించిన విషయం తెలుసుకుని పరామర్శించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి దాడులకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ద్వితీయ శ్రేణి నాయకుల్లో గుబులు

- బూత్‌ల వారిగా వెల్లడి కానున్న ఫలితాలు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికపై ఫలితాల ప్రభావం

జగిత్యాల, మే 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఫలితాలు పోలింగ్ బూత్‌ల వారిగా వెల్లడి కానుండడంతో ద్వితీయ శ్రేణి నాయకత్వంలో గుబులు నెలకొంది. జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో తమ తమ వార్డులతో పాటు తమ గ్రామాల్లో ఏ పోలింగ్ కేంద్రంలో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయోనని ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా వెల్లడి కానుంది. నియోజకవర్గాల్లో ఆయా పార్టీలకు ఆధిక్యత తీసుకొని రావడానికి ద్వితీయ శ్రేణి కార్యకర్తలు, చోటామోటా నాయకులు పనిచేశారు. వారి వారి పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత అభ్యర్థులకు ఎన్ని ఓట్లు వచ్చాయో అన్న విషయం స్పష్టంగా తేలనుండడంతో నేతల పనితీరు ఇట్టే తెలిసిపోతోంది. ఒక వేళ వారి వారి పోలింగ్ కేంద్రంలో సంబంధిత అభ్యర్థులకు తక్కువ ఓట్లు వచ్చినట్లయితే ఆ పోలింగ్ బూత్ పరిధిలోని చోటామోటా నాయకుల పనితీరుపై నియోజకవర్గ స్థాయి నాయకులు అసంతృప్తి వ్యక్తం చేసే అవకాశాలున్నాయి. పోలింగ్ బూత్‌ల వారిగా వచ్చిన ఫలితాలు బట్టే ద్వితీయ శ్రేణి నాయకత్వానికి సంబంధిత పార్టీల్లో గౌరవం దక్కే వీలుంది. రానున్న మున్సిపల్, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పార్టీ టిక్కెట్లు పొందే వీలుంటుంది. పలు నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులు ఆశించి ప్రధాన పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు లోక్‌సభ ఎన్నికల్లో పనిచేశారు. ద్వితీయ శ్రేణి నాయకుల పనితీరు పోలింగ్ స్టేషన్ల వారిగా వెల్లడి కానున్న ఫలితాలతో స్పష్టంగా తేలనుండడంతో గుబులు పట్టుకుంది. పోలింగ్ అనంతరం కూడా చాలా మంది ద్వితీయ శ్రేణి నాయకులు ఇక్కడ మన అభ్యర్థికే ఓట్లు పడ్డాయని, మనమే బయటపడుతామని సెగ్మెంట్ స్థాయి నాయకలకు భరోసా ఇస్తున్నారు. అధినాయకుల మెప్పు పొందేందుకు ద్వితీయ శ్రేణి నాయకులు నానా తిప్పలు పడి ప్రచారాలు జరిపారు. వచ్చే నెల 4న వెల్లడి కానున్న ఫలితాల్లో పోలింగ్ కేంద్రాల వారిగా రానుండడంతో ద్వితీయ శ్రేణి నాయకత్వంలో ఇప్పటి నుంచే ఆందోళన మొదలైంది. ఒక వేళ సంబంధిత పోలింగ్ కేంద్రంలో మెజార్టీ రాకుంటే పార్టీ అభ్యర్థి, అధినాయకుల వద్ద తమ పరిస్థితి ఏమిటని ద్వితీయ శ్రేణి నాయకులు ఆందోళనకు గురవుతున్నారు. ఫలితాల ప్రభావం రానున్న మున్సిపల్, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల అభ్యర్థుల ఎంపికపై పనిచేసే ప్రమాదం పొంచి ఉంది. దీంతో ద్వితీయ శ్రేణి నాయకులు ఆందోళనకు గురవుతున్నారు.



పోలింగ్ నమోదు లోనూ అతివలదే పై చేయి

- మహిళా ఓట్ల పోలింగ్ కలిసొచ్చేదెవరికో..?
- నిజామాబాద్ పార్లమెంట్‌లో మహిళలు 6,73,629 మంది ఓటు వినియోగం



జగిత్యాలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు(ఫైల్)

జగిత్యాల, మే 14 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో జరిగిన పోలింగ్ నమోదులోనూ అతివలదే పైచేయిగా ఉంది. జనాభా, ఓటర్ల సంఖ్యలకు తోడుగా ఓటుహక్కును వినియోగించుకోవడం లో సైతం మహిళలు ముందంజలో ఉన్నారు. ఉదయం నుంచే పోలింగ్ స్టేషన్ల వద్ద మహిళలు బారులు తీరి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల బరిలో తలపడ్డ అభ్యర్థుల భవితవ్యం మహిళల ఓటర్లపైనే ఆధారపడి ఉంది. సెగ్మెంట్‌లలో మహిళా ఓటర్ల మొగ్గు కీలకంగా తయారయింది.

పోలింగ్‌లో మహిళలదే ఆధిక్యం..

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 12,26,133 మంది ఓటు హక్కు వినియోగించుకోగా ఇందులో పురుషులు 5,52,465 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు 6,73,629 మంది, ఇతరులు 39 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల కంటే మహిళలు 1,21,164 మంది అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల సెగ్మెంట్‌లో 95,622 మంది మహిళలు, కోరుట్ల నియోజకవర్గంలో 1,01,179 మంది మహిళలు, బాల్కొండలో 98,486 మంది, నిజామాబాద్ రూరల్‌లో 1,08,702 మంది, నిజామాబాద్ అర్బన్‌లో 95,731 మంది, బోధన్‌లో 87,494 మంది, ఆర్మూర్‌లో 86,424 మంది మహిళలు ఓటు వేశారు.

మహిళా ఓట్లపై ఆశలు...

మహిళా ఓట్లపై ప్రధాన రాజకీయ పక్షాలు ఆశలు పెంచుకున్నాయి. ఎవరికి వారే మహిళల ఓట్లు తమకంటే తమకు కలిసి వస్తాయని అంచనా వేస్తున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు అతివల ఓట్లు తమకే లభిస్తాయని ధీమాతో ఉన్నాయి. మహిళా ఓటర్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, అభయహస్తంలతో పాటు స్వశక్తి సంఘాలలో చురుకైన పాత్ర వహించడంతో మహిళా ఓటర్లు అధికంగా పోలింగ్ కావడంతో విజయావకాశాలు తమనే వరిస్తాయని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు సైతం మహిళల అండదండలు తమకే అందాయని పేర్కొంటున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కీలకంగా ఉన్న మహిళా ఓటర్లు ఏ అభ్యర్థి వైపు మొగ్గు చూపితే ఆ అభ్యర్థి గెలుపొందే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

జిల్లా స్థాయి పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి, మే, 14 : జిల్లా స్థాయిలో నిర్వహించే అథ్లెటిక్స్ పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18న మెట్‌పల్లి మినీ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించే అండర్ 8,10, 12, 14, 16, 18, 20 సంవత్సరాల విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తామన్నారు. స్టేడియంలో 50 మీటర్ల రన్నింగ్, 150 మీటర్ల స్టాండింగ్ బ్రాడ్ జంప్, లాంగ్ జంప్, 300మీటర్ల రన్నింగ్, 400మీటర్ల రన్నింగ్‌తో పాటు వివిధ అంశాల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని తమ నైపుణ్యంతో పోటీలో పతకాలు సాధించలన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల దాడిపై ఖండన

కథలాపూర్, మే 14 : ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ కార్యకర్త నేతుల మల్లేశంపై దాడి చేసి గాయపరిచన ఘటన పట్ల తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదని గ్రహించిన నాయకులు బీజేపీ శ్రేణులపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మూడోసారి మోదీ ప్రధాన మంత్రి కాబోతున్నారని జీర్ణించుకోలేని నాయకులు దాడులు చేయడం దారుణమన్నారు.



అసంపూర్తిగా భవన నిర్మాణ పనులు

నిలిచిన ఐసీడీఎస్ భవన నిర్మాణ పనులు

- ఇబ్బందుల్లో అంగన్‌వాడీలు

మల్యాల, మే 14: నిధుల లేమితో కాంట్రాక్టర్ చేతులెత్తేయడంతో తొమ్మిదేళ్లుగా పిల్లర్ల దశలోనే మల్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం మగ్గుతోంది. పనులు నిలిచిపోవడంతో భవనం పూర్తి కాక ఏళ్లుగా అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య కార్యాలయం నిర్వహించాల్సి వస్తోంది. మల్యాల ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలో మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి, గొల్లపల్లి మండలాలు ఉండగా దాదాపు 250కి పైగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. ప్రాజెక్టు కార్యాలయానికి సొంత భవనం లేక అద్దె భవనంలోనే ఇరవై ఏళ్లుగా కాలం వెళ్ల దీస్తున్నారు. కార్యాలయ భవనం, సమావేశ మందిరం, గోదాం లేక తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు. ప్రతి నెలా జరిగే మీటింగ్‌లను ప్రైవేట్ స్థలాల్లో నిర్వహించుకోవాల్సి వస్తుండగా అంగన్‌వాడీ టీచర్లకు, సిబ్బందికి అసౌకర్యంగా మారింది. దీంతో 2015లో రూ.30లక్షల వ్యయ అంచనాలతో మండల విద్యాధికారి కార్యాలయం ముందు ప్రాజెక్టు కార్యాలయం నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఆ స్థలంలో పూర్తిగా బండ రాళ్ల ఉండడంతో దాదాపు నిధులన్నీ అక్కడేకే సరిపోగా పిల్లర్ల దశ వరకు పనులు చేపట్టారు.

ఆపై బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడం, నిధులు సరిపోక పోవడంతో పనులు నిలిచి పోయాయి. దీంతో అంగన్‌వాడీలు సొంత భవనం లేక పడుతున్న ఇబ్బందులపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ చూపాలను కోరుతున్నారు.

మూణ్నాళ్ల ముచ్చటగా పాఠశాల డైనింగ్ హాల్


హన్మాజిపేట పాఠశాలలోని డైనింగ్ హాల్‌పై లేచిన రేకులు

వేములవాడ రూరల్, మే 14: నూతనంగా నిర్మించిన పాఠశాల డైనింగ్ హాల్ పరిస్థితి మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. వేములవాడ రూరల్ మండలంలో పలు పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా డైనింగ్ హాల్‌లను నిర్మించారు. హన్మాజిపేట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సైతం దాదాపు రూ.14 లక్షల ఎంపీఎంటీ నిధులతో డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టారు. మూడు నెలల క్రితం ప్రారంభించారు. ఇటీవల గాలిదుమారంతో కురిసిన వర్షానికి డైనింగ్ హాల్ రేకులు ఎగిరిపోయాయి. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో అధికారులు పరిస్థితిని గమనించడంలేదని స్థానికులు తెలిపారు. వర్షాలు కురిస్తే నీరు మొత్తం డైనింగ్ హాల్‌లోకి చేరుతుందని పేర్కొన్నారు. పాఠశాల తిరిగి ప్రారంభం కాకముందే డైనింగ్ హాల్ రేకులను తిరిగి అమర్చాలని కోరుతున్నారు.

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో..

పెరిగిన పోలింగ్ శాతం

- 71.92 శాతం నమోదు
- ఈ ఎన్నికల్లో అత్యధికంగా ఓటు వేసిన మహిళలు
- నిజామాబాద్ అర్బన్‌లో పెరిగిన ఓటింగ్


స్ట్రాంగ్ రూంకు సీల్ వేస్తున్న అధికారులు


స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను పరిశీలిస్తున్న అధికారులు

నిజామాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికల కన్నా పోలింగ్ ఎక్కువైంది. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు ఓటర్లకు విజ్ఞప్తి చేయడంతో ఈ శాతం పెరిగింది. గత ఎన్నికలకంటే 3.57 శాతం పోలింగ్ ఎక్కువగా జరిగింది. నిజామాబాద్ అర్బన్‌లోనూ గత పార్లమెంట్ ఎన్నికలకంటే ఎక్కువగా పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో యువత నుంచి వృద్ధుల వరకు పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంతో శాతం పెరిగింది. మహిళలు కూడా ఈ ఎన్నికల్లో ఎక్కువ శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలైన మొత్తం ఓటర్లలో మహిళా ఓటర్లే అత్యధికంగా ఓటు వేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఈవీఎంలు వచ్చిన తర్వాత తుది పోలింగ్ శాతాన్ని అధికారులు విడుదల చేశారు.

● ఓటు హక్కు వినియోగించుకున్న 12,26,133 మంది..

ఈ ఎన్నికల్లో పోలింగ్ జరగడంతో ఓటర్లు కూడా ఎక్కువ మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 17,04,867 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12,26,133 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా జరగగా 10,61,622 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ ఎన్నికల్లతో పోలిస్తే 1,64,511 మంది ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళలే ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 8,06,130 మంది ఉండగా, 5,52,465 మంది ఓటు వేశారు. మహిళా ఓటర్లు 8,98,647 మంది ఉండగా 6,73,629 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల కంటే 1,21,164 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతరులు 90 మంది ఉండగా వారిలో 39 మంది ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గంలో 2,12,145 మంది ఓటర్లు ఉండగా 1,55,159 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బోధన్‌లో 2,23,096 మంది ఉండగా 1,66,330 మంది, నిజామాబాద్ అర్బన్‌లో 3,04,317 మంది ఉండగా 1,88,159 మంది, నిజామాబాద్ రూరల్‌లో 2,56,593 మంది ఉండగా 1,91,252 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాల్కొండలో 2,26,792 మంది ఉండగా 1,69,524 మంది ఓటు వేశారు.కోరుట్ల నియోజకవర్గంలో 2,45,249 మంది ఓటర్లు ఉండగా 1,80,867 మంది, జగిత్యాలలో 2,36,675 మంది ఉండగా 1,74,842 మంది ఓటు వేశారు. ఈ ఎన్నికలు అధికారులు ఛాలెంజ్‌గా తీసుకొని పనిచేయగా ఓటర్లు కూడా ఎండను సైతం లెక్కచేయకుండా పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల కమిషన్ అవగాహన కార్యక్రమాలు, అధికారులు చేపట్టిన కార్యక్రమాలు, వివిధ సంఘాలు, రాజకీయ పార్టీలు తీసుకున్న నిర్ణయాల వల్ల పోలింగ్ శాతం పెరిగింది. జిల్లాలో యంత్రాంగం తరపున చేపట్టిన అన్ని కార్యక్రమాలతో పోలింగ్ శాతం పెరిగినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి పోలింగ్ బూత్‌ల వారిగా ఏర్పాటు చేయడం, ఓటు నమోదు చేయడం, లిస్టుల పంపిణీ చేయడం వల్ల ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. ప్రజలు సహకరించి పోలింగ్ కేంద్రాలకు పెద్ద ఎత్తున వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.


స్ట్రాంగ్ రూం వద్ద భద్రత

● బాల్కొండలో అత్యధికం..

నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఈ దఫా పోలింగ్ శాతం భారీగా పెరిగింది. ఈ ఎన్నికల్లో 71.92 శాతం పోలింగ్ నమోదైంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో 68.37 శాతం నమోదైంది. ఆ ఎన్నికల్లతో పోలిస్తే ఎక్కువగా జరిగింది. నిజామాబాద్ అర్బన్‌లోనూ పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ పోలింగ్ శాతం పెరగడానికి ఓటర్లు ఎక్కువగా పోలింగ్ కేంద్రాలకు రావడం వల్లనే జరిగింది. పార్లమెంట్ పరిధిలోని ఆర్మూర్‌లో 73.14 శాతం, బోధన్‌లో 74.56 శాతం, నిజామాబాద్ అర్బన్‌లో 61.83 శాతం, నిజామాబాద్ రూరల్‌లో 74.54 శాతం, బాల్కొండలో 74.75 శాతం, కోరుట్లలో 73.75 శాతం, జగిత్యాలలో 73.85 శాతం పోలింగ్ నమోదైంది. నిజామాబాద్ అర్బన్‌లో గత ఎన్నికల్లకంటే ఎక్కువగా పోలింగ్ శాతం పెరిగింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో అర్బన్‌లో 56.25 శాతం నమోదు కాగా ఈ దఫా 5.68 శాతం పెరిగింది. ఈ ఎన్నికల్లో కొత్త ఓటర్లతో పాటు మహిళలు, వృద్ధులు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామాల్లో పట్టణాల కంటే ఎక్కువగా ఓటర్లు తరలివచ్చి ఓటు వేశారు. మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ శాతం కొద్దిగా మెరుగుపడ్డ గ్రామీణ ప్రాంతంతో పోల్చుకుంటే తక్కువగా పోలింగ్ జరిగింది. ఈ పోలింగ్ శాతం పెరిగేందుకు జిల్లా అధికారులతో పాటు రాజకీయ పార్టీల నేతలు కూడా ప్రయత్నాలు చేశారు. ఎన్నికల ప్రచారంలో ఓటు వేయాలని ఎక్కువగా కోరడంతో ఈ పోలింగ్ శాతం గత ఎన్నికలకంటే పెరిగింది.

చెరువులు, కాలువల మరమ్మతుకు మోక్షం లభించేనా?

- గత వర్షాకాలంలో చెరువులకు గండ్లు
- ఎన్నికల కోడ్‌తో నిలిచిన నిధుల కేటాయింపు
- నిరాశలో రైతాంగం


గంభీర్‌పూర్ కొచ్చెరువుకు ఏర్పడ్డ గండి

కథలాపూర్, మే 14: గడిచిన ఏడాది కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల కాలువలకు గండ్లు పడి నీరంతా వృధాగా పోయింది. దీంతో వాగులకు పక్కన ఉన్న భూములు కోత గురికావడమే కాకుండా పంటలన్నీ కొట్టుకుపోయాయి. రైతులకు విపరీతమైన నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో వాటిని మరమ్మతులు చేయాల్సిన అవసరం ఏర్పడగా నిధుల కేటాయింపుకు ఎన్నికల కోడ్ గండంలా వచ్చి పడింది. ఈ కారణంగా చెరువులు, కుంటల మరమ్మత్తులకు మోక్షం లభించే పరిస్థితి కనిపించకపోవడంతో రైతాంగం తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురవుతోంది.

● నిధుల కేటాయింపునకు లభించని మోక్షం..

మండలంలోని గంభీర్‌పూర్‌కు భూగర్భ జలాలను పెంచడానికి ఎంతో ఉపయుక్తంగా ఉన్న కొచ్చెరువు గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు గండి పడడంతో నీరంతా వృధాగా పెద్దవాగులో పడిపోయింది. వరద తాకిడికి బొమ్మెన, తక్కళ్ళపల్లి, దూలూరు గ్రామాలకు చెందిన వాగును ఆనుకుని ఉన్న భూములు భారీ కోతకు గురయ్యాయి. సారవంతమైన భూములు కొట్టుకుపోయాయి. ఇరిగేషన్ అధికారులు చెరువును సందర్శించి అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నిధుల విడుదల కోసం నివేదికలు పంపించారు. ఆగస్టు మాసంలో చెరువుకు గండిపడగా సెప్టెంబరులో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిధుల విడుదలకు ఆటంకం ఏర్పడింది. డిసెంబర్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరినప్పటికీ నిధుల కటకట ఏర్పడ్డ విషయం తెలిసిందే. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన కోడ్ అడ్డు వచ్చింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో నిధుల కేటాయింపునకు మోక్షం లభించకుండా పోయిందని రైతాంగం వాపోతున్నారు.

అదేవిధంగా వర్షాలకు రాళ్ళవాగు ప్రాజెక్ట్ కుడి కాలువకు గండి పడ్డ క్రమంలో నీరు ఆత్మకూర్ వాగులోకి వృధాగా పోయింది. కాలువ చివరి భూములకు నీరు రాని పరిస్థితి ఎదురై భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోయాయి. ఈ గండి పూడ్చడం, ఇతరత్రా మరమ్మతుల కోసం అధికారులు రు. 38 లక్షలతో అంచనాలు రూపొందించి నివేదిక సర్కారుకు పంపించారని తెలిసింది. వర్షాకాలం మరో 20 రోజుల్లో ఆరంభం కానున్నందువల్ల ఈ ఏడాది మరమ్మతులు జరిగే పరిస్థితి కనిపించడం లేదని రైతాంగం ఆందోళన చెందుతోంది. గండ్లు పూడ్చకపోతే ఈ ఏడాది నీరంతా వృధాగా పోక తప్పదని పేర్కొంటున్నారు.

● చివరి భూములకు నీరందే పరిస్థితి లేదు



- రాజరెడ్డి, రైతు కథలాపూర్

ప్రాజెక్ట్ కుడి కాలువకు గండి పడగా నీరు వాగులోకి వృధాగా పోయింది. దీనివల్ల చివరి భూములకు నీరు రాక ఎంతో ఇబ్బందులు పడ్డాం. బావులు, బోర్లలో నీరు అడుగంటి పంటలు రబీ సీజన్‌లో ఎండిపోయాయి. కాలువలో నీరుంటే పంటలకు ఢోకా ఉండేది కాదు. కాలువకు చివరన ఉన్న మాలాంటి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తే బాగుండేది.

● ప్రత్యేక నిధులు కేటాయించాలి



- పిడుగు తిరుపతిరెడ్డి, బొమ్మెన

గండ్లు పడ్డ చెరువులు, కుంటలు, కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి త్వరగతి పనులు పూర్తి చేయాలి. ఎన్నికలు పూర్తయినందు వల్ల ప్రభుత్వం నిధులు విడుదల చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేపడితే నీరు వృధాగా పోకుండా అరికట్టడానికి అవకాశం ఉంది. మరికొద్ది రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మరమ్మతులు చేపడితే రైతులకు న్యాయం జరుగుతుంది.

బెస్ట్ అవైలబుల్ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

గణేశ్‌నగర్, మే 14: 2024-25 విద్యా సంవత్సరానికి అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు న్యాతనియల్ తెలిపారు. మార్చి2024లో పదో తరగతిలో ఏడు జీపీఏ ఆపై గ్రేడు పొందిన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ప్రభుత్వ షెడ్యూల్డ్ కులముల వసతి గృహాలు/ఆశ్రమ పాఠశాలలు/ కస్తూర్బా పాఠశాలలు, ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలో చదివిన విద్యార్థులు (డీ స్కాలర్స్), ప్రభుత్వ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్, జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదివిన విద్యార్థులు ధరఖాస్తులు చేసుకోవచ్చు అని తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి 30వరకు వరకు ఈ-పాస్ (https://telanganaepass.cgg.gov.in)ధరఖాస్తుతో పాటు పదో తరగతి పాస్ మెమో, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాస్ బుక్, అధార్ నంబర్, రేషన్ కార్డ్ నంబర్ వివరాలు జతజేయాలి. ఆన్‌లైన్‌లో ఈ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునే టప్పుడు విద్యార్థులు ప్రాధాన్య క్రమములో మూడు కళాశాలలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ ముగిసిన అనంతరం ఈ-పాస్ సిస్టమ్ ద్వారా విద్యార్థుల ఎంపిక ఆటోమేటిక్‌గా కళాశాలలు అలాట్ చేయబడతాయని తెలిపారు.

పోలీస్ కమిషనర్‌పై ఈసీ, డీజీపీకి ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, మే14: తన భర్త ఆకుల ప్రకాష్‌పై తప్పుడు కేసు నమోదు చేసి, జైలుకు పంపించారని ఆరోపిస్తూ ఈసీ, డీజీపీలకు ఫిర్యాదు చేసినట్లు కరీంనగర్ కార్పొరేటర్ ఆకుల పద్మ-ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ సీపీ ప్రత్యేకంగా ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్ పేరిట ఏర్పాటు చేసి భూవివాదాలకు సంబంధించిన ఫిర్యాదులలో రాజకీయనాయకుల ప్రమేయం ఉన్న వాటిపైనే కేసులు నమోదు చేసి, అరెస్టులు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో భాగంగా తన భర్త ఆకుల ప్రకాష్‌పై 11 నెలల కిందట నమోదైన ఎఫ్ఐఆర్‌ను తిరిగి ఆల్టర్ చేసి అదనపు సెక్షన్‌లను పెట్టి కేసు నమోదు చేసి, అరెస్టు చేసి జైలుకు తరలించారని పేర్కొన్నారు. తన భర్తపై నమోదైంది తప్పుడు కేసు అని, దీనిపై తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు. దీనిపై త్వరలో సీఎంకు విన్నవించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు

కరీంనగర్ క్రైం, మే 14: విద్యుత్ చౌర్యం కేసులో పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం రొంపికుంటకు చెందిన పులిపాక రాజలింగకు పెద్దపల్లి జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి హేమంత్‌కుమార్ మంగళవారం జైలు శిక్ష లేదా జరిమానా చెల్లించాలని తీర్పు వెలువరించినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎస్ఐ ఎండీ షాదులాల్ల బాబా తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా విద్యుత్ చౌర్యంకు పాల్పడిన రాజలింగంకు 57,344 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారని ఎస్ఐ తెలిపారు.

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

● వంతెన నిర్మాణం పూర్తి ● కొనసాగుతున్న రాకపోకలు ● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కొడిమ్యాల, మే 14: జగిత్యాల జిల్లా కొడిమ్యాల-నాచుపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావటంతో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. కొడిమ్యాల ఎంపీపీ స్వర్ణలత, జడ్పీటీసీ ప్రశాంతి కొడిమ్యాల-నాచుపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేయించాలని కోరటంతో గత ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణానికి డీ.ఎం.ఎఫ్.టీ నుంచి 4కోట్ల 80 లక్షల రూపాయలను మంజూరు చేయించారు. గతంలో వర్షాకాలం వచ్చిందంటే చాలు నాచుపల్లి-కొడిమ్యాల గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయేది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వరస్వామి దర్శనం చేసుకున్న భక్తులు, మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహాస్వామి దర్శనం చేసుకొని జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దర్శనానికి కొడిమ్యాల-నాచుపల్లి గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ కాజ్‌వే పైనుంచి రాకపోకలు సాగించే వారు. మండల కేంద్రానికి చెందిన పలువురు నిత్యం వ్యసాయ పనులకు ఇతర గ్రామాలకు, జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇదే దారి గుండా వచ్చిపోతారు. బ్రిడ్జ్ నిర్మాణం కాక ముందు వర్షాకాలంలో పలు మార్లు వాహనాలు వరద నీటిలో ఇరుక్కున్న సందర్భాలు ఉన్నాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో సుమారు నెల రోజుల నుంచి ప్రయాణికులు బ్రిడ్జిపైనుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కొడిమ్యాల-నాచుపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి కావటంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రానున్న వర్షాకాలం నుంచి వరదనీటి కష్టాలు తీరనున్నాయని ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వాగుపై నిర్మించిన బ్రిడ్జి

బ్రిడ్జ్ నిర్మాణంతో సంతోషంగా ఉంది

పర్లపెల్లి ఆనందం, రైతు, కొడిమ్యాల



నాచుపల్లి-కొడిమ్యాల గ్రామాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జ్ నిర్మించడం సంతోషంగా ఉంది. బ్రిడ్జ్‌కు పాత రోడ్డుకు మధ్యలో మిగతా పని పూర్తి చేయాలి. మొరం కుప్పలను చదును చేయించాలి. బ్రిడ్జ్ నిర్మాణానికి కృషి చేసినవారందరికీ కృతజ్ఞతలు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



శ్రీచరణ్ (ఫైల్)

వేములవాడ టౌన్, మే 14: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కొడిమ్యాల మండల తిరుమలాపూర్ గ్రామానికి చెందిన పన్యాల వాణిరాజు దంపతులు కొంత కాలంగా తమ ఇద్దరు కుమారులతో కలిసి వేములవాడలో నివాసం ఉంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఫిబ్రవరి 10వ తేదీన ద్విచక్ర వాహనాన్ని సర్వీసింగ్ చేయించేందుకు చిన్న కుమారుడు శ్రీచరణ్ (18) కరీంనగర్ షోరూంకు వెళ్లాడు. సర్వీసింగ్ పూర్తి చేసుకుని తిరిగి వేములవాడకు వస్తున్న క్రమంలో ఉజ్వలపార్కు సమీపంలో వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడు నెలల పాటు శ్రీచరణ్ తలకు మూడుమార్లు ఆపరేషన్ చేసినా ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి మృతి చెందగా మృతదేహం మంగళవారం ఇంటికి తీసుకువచ్చారు. తమ కుమారుడు తిరిగి ఇంటికి వస్తాడు అని ఆశించిన కుటుంబ సభ్యులు శక్తికి మించి కొడుకు కోసం రూ.కోటి ఖర్చు చేసినా ఫలితం లేకపోవడంతో తల్లిదండ్రుల రోదనలు చూసి పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం.. యువకుడి మృతి



ప్రసాద్ (ఫైల్)

సుల్తానాబాద్ మే 14: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధి పూసాల గ్రామానికి చెందిన యువకుడు మృతిచెందాడు. పూసాలకు చెందిన గొల్లపల్లి లక్ష్మీనారాయణ కుమారుడు ప్రసాద్(25) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రసాద్ హైదరాబాద్ నుంచి సుల్తానాబాద్ వచ్చాడు. తిరిగి సాయంత్రం హైదరాబాద్ వెళ్లాడు. అదేరోజు రాత్రి ప్రసాద్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గచ్చిబౌలి వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొన్నప్రమాదంలో ప్రసాద్ మృతిచెందాడు.

చికిత్స పొందుతూ మాజీ జడ్పీటీసీ మృతి

జూలపల్లి, మే 14: జూలపల్లి మాజీ జడ్పీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాటకుల నర్సయ్య(48) మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు పాటకుల నర్సయ్యను ఐదురోజుల క్రితం అతని ఇంట్లోనే రాత్రి నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తీవ్రంగా కొట్టి చిత్రహింసలకు గురిచేశారు. రక్తం మడుగులో అపస్మారక స్థితిలో పడి ఉన్న నర్సయ్యను గ్రామస్థులు గుర్తించి సమీప బంధువులకు తెలుపగా వారు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరింత మెరుగైన వైద్యం కోసం ప్రతిమ ఆసుపత్రిలో చేర్పి వైద్యం అందిస్తుండగా మంగళవారం మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బావిలో పడి గొర్రెలకాపరి మృతి

జూలపల్లి, మే 14: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన నిట్టు మల్లయ్య(65) అనే గొర్రెలకాపరి బావిలో పడి మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఈ నెల 13న సోమవారం ఓటు వేసి ఇంటికి వచ్చిన మల్లయ్య గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో మల్లయ్య భార్య, బంధువులు వెతుకుతుండగా మంగళవారం అబ్బాపూర్ శివారులోని బావిలో పడి మల్లయ్య మృతిచెంది కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఓటింగ్‌లో హిందువులు ఐక్యత చాటారు

● ప్రభుత్వం హామీలపై దృష్టి సారించాలి ● బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 14: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో హిందువులు ఐక్యత చాటారని, హిందువులు ఏకమైతే ఫలితాలు ఎలా ఉంటాయో నిరూపించారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని టవర్‌సర్కిల్ ప్రాంతంలో కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్‌లో బీజేపీని ఓడించేందుకు ముస్లిలంతా ఏకం కావాలంటూ కేసీఆర్ పిలుపునిచ్చారని, హిందువులంతా ఏకమైతే ఏ విధమైన ఫలితాలు వస్తాయో జూన్4వ తేదీన తేలిపోతుందన్నారు. ఆ రోజు ఫలితాలను చూసి తట్టుకునే శక్తి కేసీఆర్‌కు ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఆ రోజు ఇద్దరు డాక్టర్లను పక్కన పెట్టుకోవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించారని, ఎన్నికల్లో ఓటు వినియోగించుకున్న ఓటర్లందరికీ ధన్యవాదాలు తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో గెలుపుపై విశ్వాసం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎన్ని అడ్డదారులు తొక్కినా ప్రజలు బీజేపీ పక్షాన నిలిచారన్నారు. కొన్ని ప్రాంతాల్లో కింది స్థాయి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారని, లాఠీ చార్జీ సైతం చేశారన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీకి ఏవిధంగా నైతే పోలీసులు సహకరించారో అదే విధంగా కాంగ్రెస్ పార్టీకి కొంత మంది పోలీసులు సహకరించారన్నారు. హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతం విషయంలో పచ్చి అబద్ధాలాడారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ఎన్ని ప్రారంభించారు, వాటిపై శ్వేతపత్రం విడుదల చేయాల్సి ఉందన్నారు. 500 బోనస్ ఇవ్వలేదు. పేదలకు ఇస్తామన్న హామీలన్నీ అమలు చేయాలన్నారు. రైతులకు బోనస్ ఇస్తామని ప్రకటించి ఏమైందన్నారు. ఎంత మందికి ఇచ్చారు. మీరు ఏ విధంగా అందిస్తారో ప్రణాళిక ఏమిటని ప్రశ్నించారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు ఎంత ఖర్చు అవుతుంది, ఆదాయం ఎలా సమకూర్చుకుంటారని విధివిధానాలు తయారు చేసి అమలు చేయాలన్నారు. విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించక పోవడంతో కళాశాలల యాజమాన్యాలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారాన్నరు. ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులకు ప్రతి నెల 1వ తేదీన జీతాలివ్వడంతో పాటు, వారికి పీఆర్‌సి, వారి బకాయి డీఏలు వెంటనే విడుదల చేయాలన్నారు.



టవర్ సర్కిల్‌లో కార్యకర్తలతో కలిసి టీ తాగుతున్న బండి సంజయ్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సృజన్ కుమార్ (ఫైల్)

మేడిపల్లి, మే 14: మేడిపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సృజన్ కుమార్(46) అనే యువకుడు మృతి చెందాడు. మేడిపల్లికి చెందిన ఎన్నమనేని సృజన్‌కుమార్ మంగళవారం తెల్లవారుజామున కారులో కోరుట్ల మండలం గుములాపూర్ నుంచి మేడిపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సృజన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం 108లో జగిత్యాలలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి భార్య ప్రణవిరావు ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. మరో 20 నిమిషాల్లో వస్తున్నా అని సృజన్ తన భార్యకు ఫోన్ చేసి చెప్పారని, సమయం దాటినా రాకపోయే సరికి జీపీఆర్ఎస్ లోకేషన్ చూసి కుటుంబీకులు సంఘటన స్థలానికి వెళ్లే సరికి ప్రమాదం జరిగి ఉందని కుటుంబీకులు తెలిపారు. అప్పటికే 108 వాహనం వచ్చిందని అందరూ కలిసి సృజన్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయం వద్ద భక్తులు

మల్యాల, మే 14: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. కొబ్బరికాయలు కొట్టె చోట, భక్తులు తలనీలాలు సమర్పించే కేశఖండన మండపంలో భక్తుల నుంచి వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికే కొబ్బరికాయలు కొట్టే చోట వసూళ్లకు పాల్పడినట్లు భక్తుల ఫిర్యాదు మేరకు కాంట్రాక్టర్‌కు నోటీస్‌లు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

చిన్నబోనాలలో యువకుల వీరంగం

● ఇరువర్గాల మధ్య ఘర్షణ

సిరిసిల్ల రూరల్, మే 14: పార్లమెంట్ ఎన్నికలు నేపథ్యంలో సోమవారం పోలింగ్ ముగిసిన తరువాత యువకులు గంజాయి, మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. ఈ సంఘటన సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాలలో చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొద్దిమంది యువకులు కొంత కాలంగా గంజాయితో పాటు మద్యానికి బానిస య్యారు. నిత్యం గ్రామంలో బైక్‌లను స్పీడ్‌గా నడిపిస్తూ ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ తరుపున తిరిగిన యువకులు సోమవారం రాత్రి గంజాయి, మద్యం మత్తులో మరో పార్టీకి చెందిన వారి ఇళ్లకు వెళ్లి తలుపులు కోడు తూ ఇబ్బందులకు గురిచేశారు. ఈ సంఘటనపై గ్రామస్థులు స్థానిక వార్డు కార్యాలయం ఎదుట మంగళవారం సమావేశమయ్యారు. రాత్రి పూట ఇబ్బందులకు గురిచేసిన వారితో మాట్లాడుతుండగా ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ విషయాన్ని గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. టౌన్ సీఐ రఘుపతి గ్రామానికి చేరుకొని ఇరువర్గాలను శాంతిపజేశారు. సోమవారం రాత్రి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్నవారి స్నేహితులు సిరిసిల్ల నుంచి పెద్దఎత్తున వాహనాలపై గ్రామానికి వచ్చి పోలీసులను అడ్డుకు నేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకొని వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన పదిమందిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

కరీంనగర్ ఎంపీగా గెలువబోతున్నాం

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, మే14: కరీంనగర్ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయసాధించనుందని ఆ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కంటే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం కాంగ్రెస్ పార్టీకి లాభిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పతకాలు అమలుపై ప్రజలు విశ్వాసం వ్యక్తం చేసి పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆదరించారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు, సంక్షేమ పథకాలపై మహిళలు, పేదలు, రైతులు, వివిధ వర్గాల ప్రజలు చూపించిన ఆదరణ తన గెలుపుకు సహాయపడుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీ తరుపున టికెట్ చివరి నిమిషంలో ఖరారు అయినప్పటికీ ప్రచారంలో రాకెట్‌లా దూసుకుపోయి పార్లమెంట్ నియోజకవర్గంలోని 40మండలాలను చుట్టి వచ్చామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండు చోట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనజాతర సభలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలు గ్రామాలలో సభల ద్వారా నియోజకవర్గంలోని దాదాపు 18లక్షల ఓటర్లలో 15లక్షల మంది ఓటర్లను కలిశామన్నారు. రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఎన్నికల్లో 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తరుపున విశ్వేశ్వరుడిలా తిరిగి కార్నర్ మీటింగ్, సమావేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించారని అన్నారు. ప్రచారంలో 15రోజుల పాటు అలుపెరుగకుండా కష్టపడిన జిల్లా మంత్రి, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు,టీపీసీసీ నాయకులు, డీసీసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాలైన మండల, గ్రామాల నాయకులకు వెలిచాల రాజేందర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి, నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, పద్మాకర్‌రెడ్డి, ఆకుల ప్రకాష్, పిట్టల రవీందర్, చింతల కిషన్, దిండిగాల మధు పాల్గొన్నారు.

మోరపల్లిలో అగ్ని ప్రమాదం : రూ.1.50లక్షల నష్టం

జగిత్యాలరూరల్,మే14: జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలో బేతి రాంమోహన్‌రెడ్డికి చెందిన కొట్టంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కొట్టంలో ఉన్న గడ్డికట్టలు పూర్తిగా కాలిపోగా సుమారు రైతుకు రూ. 1.50 వేల ఆస్తినష్టం సంభవించినట్లు రైతు రాంమోహన్‌రెడ్డి తెలిపారు.

కందకంలో పడి వృద్ధుడి మృతి

ధర్మపురి, మే 14: ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామానికి చెందిన బద్ది మల్లయ్య (70) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు కందకంలో పడి మృతి చెందాడు. ఈ నెల 5న తునికాకు సేకరణ కోసం ఉదయం 6 గంటలకు జంగల్‌కు వెళ్లిన మల్లయ్య ఇంటికి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం బూరుగుచెట్ల ఏరియా జంగల్‌లోని కందకంలో ప్రమాదవశాత్తు పడి చనిపోయి ఉన్నాడు. మల్లయ్య కొడుకు బద్ది భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

అప్పుడు నాటారు.. ఇప్పుడు నరుకుతున్నారు

● హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం ● విద్యుత్ తీగలకు అడ్డు వస్తున్నాయని తొలగింపు



బుగ్గరాజేశ్వరతండా రోడ్డు పక్కన నరికేసిన చెట్లు



సుద్దాలలో నిరసన వ్యక్తం చేస్తున్న బ్లెస్సీ



సుద్దాలలో చెట్లు నరికివేస్తున్న విద్యుత్ సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, మే 14: పల్లెల్లో పచ్చదనం పంచేందుకు ఏడేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం హరితహారం పథకం కింద మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు బుగ్గరాజేశ్వరతండా, గొల్లపల్లి, బొప్పాపూర్, తదితర గ్రామాల్లో విద్యుత్తు తీగల కింద మొక్కలను నాటి సంరక్షించారు. ప్రస్తుతం ఏపుగా పెరిగి పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఇప్పుడు విద్యుత్ తీగలకు అడ్డు వస్తున్నాయని చెట్లను నరికి వేస్తున్నారు. దారి పొడువునా ఆకట్టుకునే పచ్చని చెట్లపై గొడ్డలి వేటు వల్ల చెట్లు మొదళ్లతో దర్శనమిస్తున్నాయి. అప్పుడు నాటుడెందుకు.. ఇప్పుడు నరకడమెందుకని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముందు చూపు లేకపోవడంతో ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు నేలకూలుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.

కోనరావుపేట: మండలంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటగా అవి ఏపుగా పెరిగాయి. చెట్లు ప్రగతికి మెట్లు అన్నట్టుగా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను పెంచింది. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి పెంచిన చెట్లను నరికేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ శివారులో రోడ్డుకు ఇరుపక్కల మొక్కలు నాటగా అవి వృక్షాలుగా మారాయి విద్యుత్తు తీగలకు తగులుతున్నాయని ఏకంగా చెట్లని పూర్తిగా నరికేస్తున్నారు విద్యుత్ తీగలకు తగలకుండా కొమ్మలను నరికేస్తే సరిపోతుంది కానీ పెరిగిన చెట్లు వేసవిలో నీడను ఇస్తూ ఆహ్లాదం కలిగిస్తున్న చెట్లను నరికేస్తున్నారు

సీఎం సార్.. చెట్లను కాపాడండి

- ప్రకృతి ప్రేమికురాలు చిన్నారి బ్లెస్సీ

కోనరావుపేట: 'సీఎం సార్.. చెట్లను కాపాడండి. హరితహారంలో భాగంగా మొక్కలు నాటుతూ వస్తుంటే కొంతమంది నరికేస్తున్నారు' అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాలకు చెందిన ప్రకృతి ప్రేమికురాలు చిన్నారి బ్లెస్సీ కోరింది. మంగళవారం గ్రామంలో ఫ్లకార్డుతో నిరసన తెలిపింది. మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన ప్రకృతి ప్రేమికుడు డి.ప్రకాష్ కూతురు బ్లెస్సీ. హరితహారంలో భాగంగా ఏటా విత్తనాలను సేకరించి వాటిని మట్టితో బాల్స్ తయారు చేసి అడవుల్లో తండ్రి సహాయంతో చల్లుతోంది. అయితే హరితహారంలో భాగంగా అధికారులు కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ శివారులో రోడ్డుకు ఇరుపక్కల మొక్కలు నాటి సంరక్షించారు. ఏపుగా పెరిగి విద్యుత్ తీగలకు తగులుతున్నాయని సంబంధిత అధికారులు సిబ్బందితో చెట్లను కింది వరకు నరికివేయిస్తున్నారు. దీంతో ఆవేదన వ్యక్తం చేసిన బ్లెస్సీ చెట్లను నరికేస్తున్నారని, కాపాడాలని కోరింది.

వైభవంగా నృసింహ నవరాత్రోత్సవాలు

● రెండో రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, మే 14: ధర్మపురి లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో రెండవ రోజు మంగళవారం నృసింహ నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన, పంచోపనిషత్తులచే రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సామవేద పారాయణంతో అభిషేక పూజలు, వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండల, స్థాపిత దేవతా పూజలు, సహస్ర వరుణ, కలశ స్థాపన, స్థాపిత దేవత హోమాలు, శ్రీ స్వామి వారలకు తులసీ అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. వేసవి సెలవు దినాలు కావటం వల్ల గోదావరిలో స్నానాలు ఆచరించిన అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, సీహెచ్ రమణయ్య, నరసింహమూర్తి, నేరెళ్ల సంతోష్‌కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్, సముద్రాల వంశీ, చక్రపాణి కిరణ్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో కాత్యాయనీ కల్యాణ వ్రతం



ఉత్సవమూర్తులతో పెద్దమ్మ ఆలయం వద్ద భక్తులు

మెట్‌పల్లి, మే, 14: పట్టణంలోని బంగారు పెద్దమ్మ ఆలయంలో కాత్యాయనీ కల్యాణ వ్రతాన్ని ఘనంగా జరిపించారు. మంగళవారం ఆలయంలో బంగారు తల్లి అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలు తదితర కార్యక్రమాలను ఆలయ పురోహితుడు మదన్‌శర్మ జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులతో భక్తులు పెద్దమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి ఆలయంలో ఏర్పాటు చేయగా ఐశ్వర్య సిద్ధి, సకల కార్యసిద్ధి కోసం అపారమైన ధనలక్ష్మీ అమ్మవారికి పుష్పార్చనలతో అభిషేకాలు, పూజలు తదితర కార్యక్రమాలతో పాటు కుంకుమ పూజలు నిర్వహించారు. పురోహితుడి మంత్రోచ్చరణ మధ్య పూజలు నిర్వహించారు. భక్తులచే కుజదోష నివారణ కోసం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం భక్తులు ఆలయం సమీపంలోని శ్రీ ఐశ్వర్య లక్ష్మి గోశాలలోని గోమాతలకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపి వాటికి ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. గోశాలలో వసంతోత్సవ కార్యక్రమాలను జరిపిన అనంతరం అమ్మవారి పసుపు కొమ్ము, గాజులు, పండ్లను భక్తులకు పురోహితుడు ప్రసాదంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ పావని



మాట్లాడుతున్న మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ పావని

మెట్‌పల్లి, మే, 14 : నూతన చట్టాలపై న్యాయవాదులు అవగాహన పెంచుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ పావని అన్నారు. మంగళవారం పట్టణంలోని కోర్టు ఆవరణంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం పార్లమెంట్‌లో ఆమోదించిన భారతీయ న్యాయ సన్నిహిత బిల్లు, భారతీయ సాక్ష్యం, నాగరిక్ సురక్షా సన్నిహిత బిల్లులపై ప్రతి ఒక్కరు తెలుసుకోవలన్నారు. కొత్త చట్టాలపై న్యాయాధికారులు, న్యాయవాదులతో పాటు కక్షిదారులు, ప్రజలు అధ్యయనం చేసి అవగాహన పెంచుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాధవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ప్రధాన కార్యదర్శి తునికి వేణుగోపాల్, ఎల్మల రాంబాబు, న్యాయవాదులు కోటగిరి వెంకటస్వామి, మగ్గిడి వెంకటనర్సయ్య, కోట రాజారెడ్డి, జేడీ సుధాకర్, పసునూరి శ్రీనివాస్, హరిభూషన్, నర్సయ్య, కోల అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా సేవలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి, మే, 14 : బీఆర్ఎస్ పార్టీలోని ప్రతి ఒక కార్యకర్తకు సముచిత విలువలను కల్పిస్తుందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీ చెందిన కాంగ్రెస్ నాయకులు పొట్ట కార్తీక్‌తో పాటు సిసీయూత్ సభ్యులు బీఆర్ఎస్ యూత్ సోమిడి రఘు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్ష్యంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ కండువాను కప్పి సాధరణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఐదు నెలల పాలనలో ప్రజలు నరకం చూస్తున్నారని, ఇచ్చిన హామీలను నేరవెర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. నాడు కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకానలు తుంగలో తొక్కి ప్రజలను ఇబ్బందులోకి నెట్టిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు కక్షపూరిత దోరణి అవలభించకుండా అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలన్నారు. పార్టీలోని ప్రతి కార్యకర్తకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగంపల్లి సంజీవ్, బూరం లక్ష్మణ్, బర్ల దివాకర్, బర్ల అర్జున్, సోమిడి ప్రశాంత్, ప్రణయ్ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తికాగానే కరీంనగర్, చొప్పదండి మానకొండూర్, హుజూరాబాద్ హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాలకు సోమవారం అర్ధరాత్రి వరకు చేరుకున్నాయి. పటిష్టమైన భద్రత మధ్య ప్రత్యేక వాహనాల్లో అధికారులు ఈవీఎంలను తరలించారు. మంగళవారం ఉదయం ఈవీఎంలను స్ట్రాంగ్ రూం లకు తరలించారు. స్ట్రాంగ్ రూంలలో ఈవీఎంలను కలెక్టర్ పమేలా సత్పతి, ఎన్నికల సాధారణ పరిశీలకులు ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా పరిశీలించారు. ఈవీఎంలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను వేర్వేరు గదుల్లో భద్రపరిచి సీల్ వేసి తాళాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూంల వద్ద నిరంతరం నిఘా ఉండేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవోలు కె మహేశ్వర్, రమేష్‌బాబు, రామ్మూర్తి, ఏసీపీలు సతీష్‌బాబు, శ్రీనివాస్‌జీ, రాజకీయ పార్టీల నాయకులు సత్తినేని శ్రీనివాస్, మడుపు మోహన్, ఎస్కే సిరాజ్ హుస్సేన్, కొమురయ్య, బండ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్లమ్మ సిద్దియోగ ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న కేటీఆర్

గంభీరావుపేట, మే 14 : గంభీరావుపేట మండలం గోరంటాలలో రేణుకా ఎల్లమ్మ సిద్దియోగ ఉత్సవాలు కొన సాగుతున్నాయి. మంగళవారం ఎల్లమ్మ, జమదగ్నిల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారిని దర్శించుకున్నారు. బీఆర్ఎస్ నేతలు, స్థానిక గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్

వేములవాడ టౌన్, మే 14 : ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశాన్ని మంగళవారం కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు రాధాకృష్ణమాచార్యులు, గడ్డం సత్యనారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయన్నారు. విద్యార్థులు కళాశాలలో చేరేందుకు కృషి చేయాలని కోరారు. కళాశాలలో ప్రతీ సంవత్సరం బంగారు పథకాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు.

పట్టణ ఓటర్ల తీర్పు ఎటు వైపో..?

పెరిగిన ఓటింగ్ శాతం

జగిత్యాల టౌన్, మే 14 : జగిత్యాల పట్టణ ఓటర్లు తీర్పు ప్రతి ఎన్నికకు ఒక విధంగా తీర్పునిస్తున్నారు. మొన్న జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక ఓట్లు రాగా కాంగ్రెస్, బీజేపీలు రెండు మూడు స్థానాల్లో నిలిచాయి. దీంతో జగిత్యాల పట్టణ ఓటర్ల తీర్పుతో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దాదాపు 15 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో జగిత్యాల పట్టణ ఓటర్లు పట్టం కట్టిదెవరికో అని అపుడే చర్చలు మొదలయ్యాయి. పట్టణంలో 82 పోలింగ్ బూత్‌లు ఉండగా 86,200 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో 59,330 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో పట్టణ పరిధిలో 68.83 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు లెక్కలు తేల్చారు. జగిత్యాల నియోజకవర్గంలో 2,36,675 మంది ఓటర్లు ఉండగా 1,74,842 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో నియోజకవర్గంలో 73.87 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గ ఫలితం ఎప్పుడు జగిత్యాల పట్టణ ఓటర్లతోనే ముడిపడి ఉండడంతో పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులు ఇక్కడి ఓటర్లపైనే ఆశలు పెంచుకన్నారు. జగిత్యాల ప్రాంతం నుంచి ఎమ్మెల్సీగా ఉన్న జీవన్‌రెడ్డి నిజామాబాద్ పార్లమెంట్ నుంచి బరిలోకి దిగారు. స్థానికుడు కావడంతో జగిత్యాల ఓటర్లపై ఆశలు పెట్టుకుని రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సైతం పట్టణ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. బీజేపీ నుంచి శాసన సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బోగ శ్రావణి సైతం పట్టణంలో ప్రచారం చేపట్టి ఓటర్లను తమ వైపు తిప్పుకునేలా పావులు కదిపారు. జగిత్యాల పట్టణ ఓటర్లను ఆకట్టుకునేందుకు బీజేపీ తరపున దేశ ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహించగా, బీఆర్ఎస్ తరపున పార్టీ చీఫ్ కేసీఆర్ రోడ్ షో చేపట్టారు. కాంగ్రెస్ తరపున ప్రజా ఆశీర్వాద సభ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి రంగంలో దిగి కోరుట్ల నుంచి ప్రచారం చేపట్టగా మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్‌లు రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు చేపట్టారు. ఏది ఏమైనా సరే జగిత్యాల పట్టణ ఓటర్లు మరి ఎవరికి పట్టం కట్టిదో అనే విషయాలు తెలువాలంటే ఫలితాలు వచ్చేంతవరకు వేచి చూడాల్సిందే.

ధర్మపురి నియోజకవర్గంలో 73.34 నమోదు

ధర్మపురి: ధర్మపురి శాసన సభ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ 73.34 శాతం నమోదైంది. నియోజక వర్గ పరిధిలో గల ధర్మపురి, బుగ్గారం, వెల్గటూర్, ఎండపల్లి, ధర్మారం, గొల్లపల్లి, పెగడపల్లి మండలాలతో పాటు జూలపల్లి మండలంలోని అబ్బాపూర్ గ్రామం ఉంది. ఈ నియోజకవర్గంలో మొత్తం 2,30,786 మంది ఓటర్లున్నారు. వీరిలో 1,12,442 మంది పురుషులు, 1,18,338 మంది మహిళలు ఆరుగురు ట్రాన్స్‌జండర్లున్నారు. ఉదయం నుంచి పోలింగ్ ముగిసే వరకు మొత్తం 1,69,272 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 78,904 మంది పురుషులు, 90,367 మంది మహిళలు, ఒక ట్రాన్స్‌జండర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు ఎన్నికల పోలింగ్ ప్రారంభం కాగా 9 గంటల వరకు 8.70 శాతం, 11 వరకు 28.11 శాతం, మధ్యాహ్నాం ఒంటి గంట వరకు 47.15 శాతం, మధ్యాహ్నాం 3 గంటల వరకు 60.23 శాతం, సాయంత్రం 5 గంటలు వరకు 69.83 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 73.34 శాతం పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీజేపీ అభ్యర్థి గొమాసే శ్రీనివాస్ ప్రధాన పార్టీల అభ్యర్థులుగా పోటీలో నిలిచారు. ఈ ఎన్నికల్లో ఆయా పార్టీల అభ్యర్థుల తరపున నాయకులు పోలింగ్ తీరు గురించి లెక్కలు వేస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థికి ఈ ప్రాంతంలో ఇన్ని ఓట్లు వస్తాయని, ఆ ప్రాంతంలో అన్ని ఓట్లు వస్తాయని లెక్కలు కడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఆరు గ్యారెంటీ పథకాలు, పాంచ్ న్యాయ్ తమకు ఈ ఎన్నికల్లో లాభం చేకూరుతుందని కాంగ్రెస్ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. బీజేపీ నాయకులు మాత్రం కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ పాలనను చూసి రహస్యంగా ఓట్లు వేశారని అంచనా వేస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు, రైతులకు సాగు నీరు అందించడంలో సఫలీకృతం అయ్యారని, ఈ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి వైపు ఓటర్లు మొగ్గు చూపారని ఆశలు పెట్టుకున్నారు. ఏది ఏమైనా ఎన్నికల ఫలితాలు ప్రకటించే నాటికి అభ్యర్థులు ఎవరు గెలుస్తారనేది తేలిపోతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.



జగిత్యాలలో క్యూలో నిల్చున్న ఓటర్లు(ఫైల్)

కోరుట్ల అసెంబ్లీలో 73.75 శాతం..

కోరుట్ల : నిజామాబాదు పార్లమెంట్ పరిధిలో కోరుట్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో 73.75 శాతం ఓటింగ్ నమోదు అయింది. నియోజకవర్గంలో 2,45,249 మంది ఉండగా పురుషులు 1,16382 మహిళలు 1,28,863 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,01,170 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకోగా 79,696 మంది పురుషులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల కన్న 21,696 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకొని ముందు వరుసలో నిలిచారు. నియోజకవర్గంలోని మెట్‌పల్లి మున్సిపల్‌లో 66.35 అత్యల్ప శాతం ఓటు నమోదు కాగా మల్లాపూర్ మండలంలో 79.11 అత్యధిక శాతం ఓటు నమోదు అయింది. ఇబ్రహీంపట్నం మండలంలో 30,930 మంది ఓటర్లు ఉండగా 24,247 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 78.39 శాతం నమోదైంది. కోరుట్ల మండలంలో 30,790 మంది ఓటర్లు ఉండగా 24,194 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 78.58 శాతం ఓటు హక్కు నమోదైంది. కోరుట్ల మున్సిపల్ పరిధిలో 61,828 మంది ఓటర్లు ఉండగా 42,321 మంది ఓటు వినియోగించుకున్నారు. 68.45 శాతం ఓటు హక్కు నమోదైంది. మల్లాపూర్ మండలంలో 40,622 మంది 32,137 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 79.11 శాతం ఓటు హక్కు నమోదు అయింది. మెట్‌పల్లి మండలంలో 37,272 మంది ఓటర్లు ఉండగా 28,238 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 77.85 శాతం ఓటు హక్కు నమోదు అయింది. మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో 44,807 మంది ఓటర్లు ఉండగా 29,730 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 66.35 శాతం ఓటు హక్కు నమోదు అయింది.

అయితే ఎవరికి వారు తమ అభ్యర్థుల గెలు పోటములపై అంచనాలు వెసుకుంటున్నారు. నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు బూత్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమా వేశాలను ఏర్పాటు చేసుకుని ఎంత వరకు మెజార్టీ సాధిస్తామన్న అం చనాలు వెస్తున్నారు.

ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రజలు గుర్తించారు

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, మే, 14 : చక్కెర కర్మాగారం పునప్రారంభానికి ప్రభు త్వం చిత్తశుద్ధిని ప్రజలు గుర్తించారని, జరిగిన పార్లమెంట్ నిజామాబాద్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీవెంకటేశ్వర గార్డెన్‌లో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జరిగిన ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో తన గెలుపు కోసం కృషి చేశారన్నారు. బీజేపీ మతతత్వ పార్టీగా ఎన్నో కుట్రలకు పాల్ప డిందన్నారు. రాజకీయ లబ్ది కోసం ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించారిని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతలు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎన్నికలు శాంతియుతంగా జరిగాయన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిజామాబాద్ నిలిచిందన్నా రు. మన ప్రాంతంలోని చక్కెర కర్మాగారం 2015కు ముందు మంచి లాభా ల్లో నడిచిందని, ఆ సమయంలో రైతులు చెరుకు పంటను ఎక్కువగా పండించేవారన్నారు. చక్కెర రాజకీయాల కోసం చక్కెర కర్మాగారాన్నిపై నిర్లక్ష్యం చేయడంతో నష్టాల బాట పట్టిందన్నారు. అప్పటి నుంచి మన ప్రాం తం లోని చెరుకు పంట సాగును రైతులు తగ్గించరన్నారు. రైతులు వరికి బదు లుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడానికి ప్రభుత్వం ఆలోచణలు చేస్తుందన్నారు. దేశంలో జరిగిన 2014, 2019 ఎన్నికల సమయంలో రైతుల పంటలకు కనీస మద్దతు ధరలు, స్వామినాథన్ కమిషన్ అమలు గురించి కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతుంటే కేంద్ర మంత్రి అమిత్‌షా సాధ్యం కాద నంటున్నరని విమర్శించారు. చక్కెర ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభు త్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. చక్కెర కర్మాగారంపై ఉన్న మార్టిగేజ్ ను వన్‌టైం సెటిల్మెంట్ చేయడానికి రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేయ డాన్ని ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గుర్తిస్తున్నారన్నారు. కాంగ్రెస్‌ను ఓర్వ లేకనే నిజామాబాద్ ఎన్నికల్లో జీవన్‌రెడ్డిని ఓడించడానికి బీఆర్ఎస్ నాయ కులు బీజేపీతో కుమ్మక్కై క్రాస్ ఓటింగ్ పాల్పడ్డారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జువ్వాడి కృష్ణారావు, కొమిరెడ్డి కరంచంద్, కొమిరెడ్డి విజయ్‌ఆజాద్, కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జెట్టి లింగం, గోరుమంతుల ప్రవీణ్‌కుమార్, మామిడి నారాయణరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

బీఆర్ఎస్ నాయకుడు కోలుకోవాలని మొక్కులు

కొడిమ్యాల, మే 14 : బీఆర్ఎస్ కొడిమ్యాల మండల నాయకుడు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు అనారోగ్యం నుండి త్వరగా కోలుకోవాలని కోరుతూ మండలంలోని ఆయన స్వ గ్రామం హిమ్మతురావుపేట, డబ్బుతిమ్మయ్యపల్లి, రాంసాగర్ గ్రామాలకు చెందిన సుమారు 50 మంది అభిమానులు మంగళవారం జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొండగట్టు ఆంజ నేయస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. వారంతా ముందుగా పాదయాత్రతో కొండగట్టుకు చేరుకున్నట్లు తెలిపారు. కృష్ణారావు గత కొద్ది రోజులుగా కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

తేనెటీగల దాడి

ఎల్లారెడ్డిపేట, మే 14: ఎల్లారెడ్డిపేట మండలం గుండారంలోని గుట్టపై ఉన్న లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం ఆవరణలో మంగళవారం తేనెటీగలు దాడి చేసిన ఘటనలో చందుర్తి మండలం తిమ్మాపూరం గ్రామానికి చెందిన న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు పిట్టల భూమేశ్‌తోపాటు ఎల్లారెడ్డిపేటలోని ఆ పార్టీ నాయకులు బానోతు రాజునాయక్, అనుప గణేశ్, ఎడ్ల రాజ్‌కుమార్ అస్వస్థతకు గురయ్యారు. మండల కేంద్రంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. గుండారంలో లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు స్థానిక నాయకులతో కలిసి న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు పిట్టల భూమేశ్ హాజరయ్యారు. అనంతరం గుట్టపైకి వెళ్తున్న క్రమంలో బండరాయికి ఉన్న తేనెతుట్టే భూమేశ్ తలకు తలగడంతో ఒక్కసారిగా దాడికి చేశాయి. భూమేశ్‌కు మండల కేంద్రంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

దర్గాలో కేటీఆర్ ప్రత్యేక ప్రార్థనలు

ఎల్లారెడ్డిపేట, మే 14: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం శివారులోని దర్వేషావలి దర్గాలో ఉర్సు ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకు ముందుకు ఉర్సు ఉత్సవ కమిటీ నిర్వాహుడు అజీజ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జి అమానుషం

సిరిసిల్ల రూరల్, మే 14:నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధులను నిర్వర్తించిన ఉపాధ్యాయులకు రావాల్సిన భత్యం రాష్ట్ర వ్యాప్తంగా ఏక రీతిగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న వారిపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమని టీపీటీఎఫ్ నాయకులు అన్నారు. సిరిసిల్లలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రమానాథ్‌రెడ్డి మాట్లాడారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో విధులను నిర్వర్తించిన ఉపాధ్యాయులపై అక్కడి ఆర్డీవో లాఠీచార్జి చేయించడం సరికాదన్నారు.

సిరిసిల్ల రూరల్: ఎన్నికల విధులను నిర్వర్తించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన ఆర్డీవోపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిరిసిల్లలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ మాట్లాడారు. ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు లాఠీచార్జి చేశారన్నారు. ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన ఆర్డీవోతోపాటు పోలీసులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పల్లెల్లో పడకేసిన 'ప్రత్యేక' పాలన

● పారిశుధ్యం లోపించి ప్రజల అవస్థలు ● చాపకింద నీరులా వ్యాపిస్తున్న డెంగ్యూ విష జ్వరాలు

● పల్లెల్లో కానరాని ప్రత్యేకాధికారులు

రాయికల్, మే 14: పల్లెల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమై రెండు మాసాలు కావస్తున్నా పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన కనిపించడం లేదు. దీంతో పల్లెల్లో పచ్చదనం, పరిశుభ్రత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. పల్లెల్లో పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో మురికి కాలువలు చెత్తాచెదారం నిండిపోయి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు చాప కింద నీరులా వ్యాపించడంతో ప్రజలు అస్పత్రులపాలు అవుతున్నారు. గ్రామాల్లో ఉన్న కార్యదర్శులు నామమాత్రం పనులు చేస్తూ తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో పల్లెల్లో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాయికల్ మండలంలో 32 గ్రామాలు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల పదవీ కాలం ముగిసిపోవడంతో ఈ గ్రామాలకు ప్రత్యేకాధికా రులుగా మండల, జిల్లా స్థాయి గెజిటెడ్ అధికారులను నియమించింది. మండలం మొత్తం 14 మంది గెజిటెడ్ అధికారులను, ఒక్కొక్కరికి ఒకటి నుంచి మూడు గ్రామాల చొప్పున గ్రామాలకు కేటాయిస్తూ ప్రత్యేకాధికారులుగా ఫిబ్రవరి 3న కలెక్టర్ నియమించారు. కానీ పదవీ బాధ్యతలు చేపట్టిన అధికారులు గ్రామాలవైపు కన్నెత్తి చూడకపోవడంతో గ్రామాల అభివృద్ధి నిలిచిపోయి, వార్డుల్లో పారిశుధ్యం లోపించి ప్రజలు రోగాల పాలవుతున్నారు. ప్రత్యేక అధికారులను కేటాయించగా ప్రస్తుతం 9 మంది మాత్రమే ఉన్నారు. కొందరు జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేకాధికారుల నుంచి తప్పుకున్నారు. గ్రామాల ప్రత్యేకాధికారులుగా పదవీ బాధ్యతలు చేపట్టి, రెండు నెలలు కావస్తున్నా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపో వడంతో మురికి కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి ఈగలు, దోమలకు ఆవాసాలుగా మారి ప్రజలకు రోగాలను కలిగిస్తున్నాయి. దీంతో పల్లె ప్రజలు అస్పత్రుల్లో చేరి వేల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు. గ్రా మాల్లో మురికి కాలువలను శుభ్రం చేయకపోవడం, శానిటేషన్ చర్యలు చేపట్టకపోవడంతో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబలి రాయికల్, జగిత్యాల ఆస్పత్రులకు ప్రజలు వలస కడుతున్నారు. అంతేగాకుండా గ్రామాల్లో హరితహారం పథకం కింద నాటిన మొక్కలకు నీరు లేక ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. పల్లె ప్రకృతి వనాలు పాలకులు, ప్రత్యేకాధికారుల నిర్లక్ష్యంతో కనుమరుగవుతున్నాయి. గ్రామాల్లో సేద బావుల్లో శానిటేషన్ చేపట్టేందుకు నెలలు గడుస్తున్నాయి. రాయికల్ పట్టణ పరిసర గ్రామాలైన రామాజీపేట, భూపతిపూర్, మైతాపూర్, ఇటిక్యాల, అల్లీపూర్ వంటి పెద్ద గ్రామాల్లో మురికి కాలువలు శుభ్రం చేయక నెలలు గడుస్తున్నాయని, కొన్ని వార్డుల్లో మాత్రమే నామ మాత్రంగా శుభ్రం చేసి, మిగతావి అలాగే వదిలిపెట్టారని, దోమల నివార ణకు కనీస చర్యలు చేపట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతు న్నారు. పెద్ద గ్రామాలతో పాటు చిన్న గ్రామాల్లో సైతం ప్రత్యేకాధికారులు కన్నెత్తి చూడకపోవడం, మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు నామమాత్రంగా చర్యలు చేపట్టడంతో విష జ్వరాలు ప్రబలి ఆస్పత్రుల పాలవుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కానరాని దోమల నివారణ ఫాగింగ్ మిషన్లు..

గ్రామాల్లో దోమల బెడద ఎక్కువ కావడంతో ప్రజల అవస్థలు పడుతుంటే పట్టించుకోవాల్సిన ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. శానిటేషన్‌లో భాగంగా దోమల నివారణ కోసం వీధుల వెంట, గృహాల వెంట సాయంత్రం, రాత్రి వేళలో మిషన్‌లతో ఫాగింగ్ చేయాల్సి ఉండగా, వాటి మనుగడే కనబడటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఓ పక్క వేసవి కాలం కావడం, ఆపై ఎండలు దంచి కొట్టడంతో ఉక్కపోత ఎక్కువై, పల్లెల్లో ప్రజలు రాత్రి ఆరుబయటే నిద్రిస్తున్నారు. దీంతో దోమలు ఎక్కువై ప్రజలను కుట్టడంతో రోగాల పాలవుతున్నామని, దోమల నివారణకు రాత్రి వేళల్లో ఫాగింగ్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యవేక్షణ మరిచిన ప్రత్యేకాధికారులు

గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలకు తాగునీటి వసతితో పాటు శానిటేషన్, గ్రామాల్లో అభివృద్ధి పనులు పర్యవేక్షణవంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ గ్రామ అభివృద్ధిలో పాలుపంచుకో వాల్సిన ప్రత్యేకాధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ వారు చేసిన పనులను, చేయించిన, పర్యవేక్షించిన పనులను టూర్ డైరీలో నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ గ్రామాల్లో ప్రత్యేకాధికారులు చేసిన పనులు నామమాత్రంగా ఉండటం, కొందరు అధికారులు అయితే గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయం. ఇప్పటికైనా కలెక్టర్, సంబంధిత పంచాయతీ రాజ్ అధికారులు స్పందించి గ్రామాల్లో తక్షణమే శానిటేషన్ చర్యలు చేపట్టాలని, దోమల నివారణకు రాత్రి వేళల్లో ఫాగింగ్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ప్రత్యేధికారులు పాలన కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ఆయా గ్రా మాల ప్రజలు, నాయకులు కోరుతున్నారు.



గ్రామాల్లో మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్త



విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు

చిరంజీవి, ఎంపీడీవో



విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కార్యదర్శులకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి శానిటేషన్ వసతులు సమ కూర్చాల్సిన బాధ్యత గ్రామ కార్యదర్శులదే. ప్రత్యేకాధికారులు గ్రామాల వారీగా అభివృద్ధి పనులను శానిటేషన్ పనులను పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటాం.